రైస్‌మిల్లులో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీలు

రైస్‌మిల్లులో తనిఖీలు చేపడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

కోటగిరి, జూలై 19 : మండలకేంద్రంలోని ఓ రైస్‌మిల్లులో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం శుక్రవారం తనిఖీలు చేపట్టింది. జిల్లావ్యాప్తంగా దాడుల్లో భాగంగా తనిఖీలు చేశారు. ధాన్యం వివరాలను యజమానిని అడిగి తెలుసుకున్నారు. 69 క్వింటాళ్లు నిల్వ ఉన్నట్లు తనిఖీలో తేలిందని అధికారులు తెలిపారు. తెలంగాణ సివిల్ సప్లయీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్‌డీ శ్రీధర్‌రెడ్డి, డీఈ నిఖిల్‌రాజ్, నిత్యానందం తదితరులు తనిఖీలు చేపట్టారు. వారి వెంట కోటగిరి ఎస్సై సందీప్ ఉన్నారు.

ప్రజాపాలన కేంద్రం తనిఖీ

నందిపేట్, మే 19: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ అంకిత్ శుక్రవారం తనిఖీ చేశారు. నందిపేట్ శివారులో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆంధ్రనగర్‌లో అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, పాఠశాల పల్లెప్రకృతి వనం పరిశీలించారు. శాపూర్ గ్రామంలో సంపద వనాలు, వన్నెల్(కె)లో బృహత్ పల్లెప్రకృతి వనం, ఆరోగ్యం కేంద్రం, జీపీ కార్యాలయాలను తనిఖీ చేశారు.

కబ్జాకు గురైన చెరువుకు సర్వే

మోసా (చందూర్), జూలై 19 : మోస్రా మండలంలోని చింతకుంట గ్రామ చెరువును ఇరిగేషన్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. చెరువు కబ్జాకు గురవుతున్నదని వివిధ పత్రికల్లో కథనాలు రావడంతో స్పందించిన అధికారులు చెరువు స్థలానికి సర్వే చేపట్టారు. చెరువును పలువురు కబ్జా చేశారని గుర్తించారు. కబ్జాకు గురిచేసిన వారు స్థలాన్ని వదిలివేయాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్వే చేపట్టిన వారిలో ఏడీ వెంకటేశ్, ఇరిగేషన్ ఏఈ జీవన్, ప్రకాశ్, రషీద్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు

కంఠేశ్వర్, జూలై 19 : కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సందర్శించారు. జిల్లాలోని మున్సిపల్ పట్టణాలతోపాటు మండలకేంద్రాల్లో ప్రజాపాలన కేంద్రాలు ఉన్నాయని, కలెక్టరేట్‌కు వచ్చే అర్హులైన వారు వివిధ పథకాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు కేంద్రాన్ని ప్రారంభిం చామని తెలిపారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

ధర్పల్లి, జూలై 19 : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీవో బాలకృష్ణ, ఎక్సైజ్ సీఐ శ్రీను, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్ కోరారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో శువ్రారం 500 మొక్కలు నాటారు. అనంతరం చెరువు కట్టపై ఎక్సైజ్ శాఖతో కలిసి 1500 ఈత మొక్కలను నాటారు. కార్యక్రమంలో నాయకులు చెలిమెల నర్సయ్య, శ్రీనివాస్, సురేందర్‌గౌడ్, ఏపీవో వినోద, ఐకేపీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి సైపుదీన్, ఫీల్డ్ అసిస్టెంట్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

బోధన్ రూరల్/ రుద్రూర్, జూలై 19: పంట రుణం రూ.లక్ష వరకు రుణమాఫీలో భాగంగా మొదటి విడుత డబ్బులు విడుదల చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, రైతులు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. సాలూరా మండలంలోలని హున్సా గ్రామంలో రైతులు, కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. రుద్రూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు ఇందూర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

లాడ్జీల్లో పోలీసుల తనిఖీలు

వినాయక్‌నగర్, జూలై 19: పోలీసు ప్రత్యేక బృందాలు జిల్లాకేంద్రంలోని పలు లాడ్జీల్లో శుక్రవారం తనిఖీలు చేపట్టాయి. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా తనిఖీలు చేపట్టామని నగర సీఐ నరహరి తెలిపారు. సీసీఎస్ ఏసీపీ బోనాల కిషన్ ఆధ్వర్యంలో సీసీఎస్, ఉమెన్స్ ఇన్‌స్పెక్టర్లు సురేశ్, శ్రీలత, ఫోర్త్ టౌన్ ఎస్సై పాండేరావు, మహిళా తదితర సిబ్బంది తనిఖీల్లో చేపట్టి, అనుమానాస్పదంగా ఉన్న పలు జంటలను విచారించారు.

అక్రమ ఇంటి నంబర్ల తొలగింపు

ఆర్మూర్‌టౌన్, జులై19: మున్సిపల్ పరిధిలో గతంలో పలు ఇండ్లకు అక్రమంగా నంబర్లు ఇచ్చారని, వాటిని తొలగిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాను ఇక్కడికి రాకముందే అక్రమంగా ఇంటి నంబర్లు కేటాయించారని అన్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. మూడు నెలల నుంచి క్షేత్ర స్థాయిలో పరిశీలించి అడిషనల్ కలెక్టర్ ఆదేశాల మేరకు 30 ఇండ్ల నంబర్లను రద్దు చేశామని పేర్కొన్నారు. ఇంకా 150 ఇండ్ల నంబర్లను గుర్తించామని, వాటిని కూడా అడిషనల్ కలెక్టర్ అనుమతితో రద్దు చేస్తామని పేర్కొన్నారు. అక్రమంగా నిర్మించిన ఐదు భవనాల యజమానులకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నోటీసులు జారీ చేశామని పేర్కొన్నారు. వాటికి కూడా జరిమానాలు విధించి ఉన్నధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాని తెలిపారు. ప్రజలు మున్సిపల్ నుంచి అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతనే ఇండ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client **M/S. Shriram Finance Ltd, Nizamabad Branch - II, Dist. Nizamabad** agreed to accord Loan to **Bassi Jor Singh** S/o. Bassi Daoulathram, Age 29 Yrs, Occ: Business, R/o.H.No.1-63, Kalpole Thanda (V), Mugpal (M), Nizamabad (Dist) (Borrower/ Property holder) mortgage of the Schedule referred property. The above prospective loanee agreed to create first charge against schedule property. mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **(7) days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'waived' and not binding on my client company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property. Hence this notice.

SCHEDULE OF THE PROPERTY

The Existing Open place bearing G.P.No.1-53/22, vide Assessment No.157 admeasuring 126.22 Sq.Yds or 105.53 Sq.Mtrs situated at Kalpole Village, Mandal Mugpal, Dist. Nizamabad within the Grampanchayat Limits of Kalpole Village, Regn. Sub. Dist. and Regn. Dist Nizamabad

As bounded by : North: House of Sardar, **South:** House of Jaithram, **East:** Road, **West:** Hut & Open place of Narayan

Sd/- R.JAGADISHWER RAO, Advocate
Subhash Nagar, Nizamabad Cell:9848094409

హోటళ్లపై అధికారుల దాడులు

- పరిశుభ్రత పాటించని హోటళ్లకు జరిమానా

నగరంలోని ఓ హోటల్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

కంఠేశ్వర్/ ఆర్మూర్ టౌన్, జూలై 19 : జిల్లాకేంద్రంతో పాటు ఆర్మూర్ పట్టణంలోని పలు హోటళ్లపై అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. నగరంలోని పలు హోటళ్లలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. కపిల, లహరి హోటళ్లలో ప్రాపర్టీ ట్యాక్స్, ట్రేడ్ లైసెన్స్, పరిశుభ్రతను పరిశీలించారు. హోటళ్లలో ఫుడ్‌ను పరిశీలించి, నిబంధనల ప్రకారం లేకపోవడంతో లహరి హోటల్‌కు రూ.5 వేలు, కపిల హోటల్‌కు రూ.15,000 జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. హోటళ్లలతో పరిశుభ్రత పాటించకపోతే సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్వో నరేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నటరాజ్‌గౌడ్, రమేశ్, ఆర్ఐ సతీశ్ తదితరులు పాల్గొన్నారు. ఆర్మూర్ పట్టణంలోని పలు హోటళ్లలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్ కుమార్, పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. పరిశుభ్రత పాటించని హోటళ్లకు రూ. 10 వేల జరిమానా విధించినట్లు వెల్లడించారు. ప్లాస్టిక్ కవర్లలో ఆహార పదార్థాలను పార్సిల్ చేస్తే జరిమానాతోపాటు కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మిషన్ భగీరథ ప్లాంట్ పరిశీలన

మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్‌ను పరిశీలిస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి/ ఇందల్వాయి, జూలై 19 : మండలంలోని అర్గుల్ గ్రామశివారులో ఉన్న మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్ ప్లాంట్‌ను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి శుక్రవారం పరిశీలించారు. క్యూరింగ్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం దృష్టిలో పెట్టుకుని ప్రజలకు నాణ్యమైన, శుద్ధమైన తాగునీటిని అందించాలని అధికారులకు సూచించారు. అనంతరం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్లాంట్ ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన వెంట మిషన్ భగీరథ ఎస్ఈ రాజేందర్‌కుమార్, ఈఈ నరేశ్‌బాబు, డీఈ నవీన్‌కుమార్, ఏఈ అన్వేశ్‌రెడ్డి, తహసీల్దార్ కిరణ్మయి, ఎంపీడీవో సతీశ్, ఏఓ దేవిక, ఈజీఎస్ ఏపీవో రవి, నాయకులు ఉన్నారు.

హత్యకేసులో నిందితుడి అరెస్టు

వినాయక్‌నగర్, జూలై 19 : నగరంలోని వినాయక్‌నగర్‌లో రెండు రోజుల క్రితం జరిగిన ఆనంద్ బిహారీ పాండే హత్య కేసును పోలీసులు ఛేదించారు. పరారీలో ఉన్న నిందితుడిని శుక్రవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను నగర సీఐ నరహరి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వినాయక్‌నగర్‌లోని పర్మిట్ రూమ్‌లో జరిగిన గొడవ కారణంగా ఈ హత్య జరిగిందని విచారణలో తేలినట్లు తెలిపారు. హత్య చేసి పరారీలో ఉన్న నిందితుడు సాయి కుమార్ అమ్మ వెంచర్ వద్ద ఉన్నట్లు సమాచారం అందడంతో పట్టుకున్నట్లు వెల్లడించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. కేసు ఛేదనకు కృషిచేసిన ఫోర్త్ టౌన్ ఎస్సై పాండేరావుతో పాటు ఏఎస్సై సాయిలు, సిబ్బంది మనోజ్, అనిల్, బాలాజీ, భూరాజ్, సంగేస్, నారాయణ, రవి, రమేశ్, రాకేశ్‌ను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారని సీఐ నరహరి తెలిపారు.

ఫారెస్టు శాఖలో బదిలీలకు రంగం సిద్ధం

వినాయక్‌నగర్, జూలై 19 : అటవీ శాఖలోని మల్టీ జోన్-1 పరిధిలో బదిలీల నిర్వహణకు ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేశారు. ఫారెస్ట్ కమిషనర్ సూచనల మేరకు బదిలీ నిర్వహణకు ముందు సంబంధిత సిబ్బందికి కౌన్సెలింగ్ నిర్వహించి, వారి అభిప్రాయాలను సేకరించిన అనంతరం ట్రాన్స్‌ఫర్స్ చేయనున్నారు. ఇందులో భాగంగా గురువారం కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించారు. నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, కాళేశ్వరం జోన్‌లలో ఉన్న 110 మంది సిబ్బందికి శుక్రవారం వరంగల్‌లో కౌన్సెలింగ్ చేపట్టారు. గురువారం 45 మంది నిజామాబాద్ డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి ట్రాన్స్‌ఫర్ చేశారు. సీసీఎఫ్ (చీఫ్ కన్జర్వేరట్ ఆఫ్ ఫారెస్ట్), మల్టీజోన్ -1 ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఇందుకు గాను నిజామాబాద్ జిల్లా అటవీ శాఖ పరిధిలో ఉన్న ఐదుగురు ఎఫ్ఆర్వోలు వరంగల్‌కు తరలివెళ్లారు. నేడు (శనివారం) బాసర సర్కిల్ సీసీఎఫ్ నిర్మల్ జిల్లాలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

ఆర్మూర్ మండలంలోని అంకాపూర్ గ్రామంలో ఉన్న ఆర్మూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి రాజేశ్వర్‌రెడ్డి తన స్వగృహంలో మాజీ మంత్రి జోగు రామన్నను శుక్రవారం సన్మానించారు. - ఆర్మూర్‌టౌన్, జూలై19

రెండిండ్లలో పట్టపగలే చోరీ

వినాయక్‌నగర్, జూలై 19 : నగరంలోని ఫోర్త్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉండే ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంట్లో పట్టపగలే దొంగలు చోరీకి పాల్పడ్డారు. దొంగలు పడి నగదును దోచుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రగతి నగర్‌లో ఉండే ఉపాధ్యాయుడు శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేసే అతడి భార్య ఇద్దరూ శుక్రవారం విధులకు వెళ్లారు. ఇంట్లో ఉన్న శ్రీనివాస్ తల్లి బయటికి వెళ్లిన సమయంలో దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న సుమారు రూ. 4 లక్షల నగదు, రెండు తులాల బంగారు నగలను ఎత్తుకెళ్లారు. తిరిగివచ్చిన ఆమె.. ఇంట్లో చిందరవందరగా ఉన్న వస్తువును చూసి చోరీ జరిగినట్లు గుర్తించి, తన కుమారునికి సమాచారం అందించింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చిట్టాపూర్‌లో 8.5 తులాల బంగారం..

బాల్కొండ, జూన్ 19: చిట్టాపూలోని పుంశెట్టి లింగన్న ఇంట్లో శుక్రవారం ఎనిమిదిన్నర తులాల బంగారం చోరీ అయినట్లు ఎస్సై యాసిర్ అర్ఫాత్ తెలిపారు. లింగన్న ఉదయం 11:30 గంటలకు ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం వచ్చి చూడగా తాళం పగలగొట్టి ఉంది. బీరువా ధ్వంసం చేసి, అందులోని ఎనిమిదిన్నర తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి వేలిముద్రలు సేకరించారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

రుద్రూర్/ పొతంగల్/ ఆర్మూర్ టౌన్, జూలై 19 : ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ అయేషా సిద్ధిఖా సూచించారు. రుద్రూర్ జేఎన్‌సీ కాలనీలో సీజనల్ వ్యాధులపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. పొతంగల్ మండలంలోని వివిధ కాలనీల్లో ఆరోగ్య సిబ్బంది ఫైడే - డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను హెచ్ఈవో గోవర్ధన్ వివరించారు. ఆర్మూర్‌లోని రెండో వార్డులో ఫైడే - డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలను వైద్యసిబ్బంది అవగాహన కల్పించారు.

చెరువులో పడి మహిళ మృతి

ఆర్మూర్‌టౌన్, జూలై19: మండలంలోని మాదాపూర్ గ్రామంలో మతిస్థిమితం కోల్పోయిన సలింగటి భూదేవి(50) చెరువులో పడి మృతి చెందింది. మగ్గిడి గ్రామానికి చెందిన భూదేవి బుధవారం ఇంటి నుంచి వెళ్లింది. ఆమె తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. ఆచూకీ లభించలేదు. శుక్రవారం చెరువులో మృతదేహం లభ్యమైంది. మృతురాలి కుమారుడు సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

డ్రైనేజీ, పార్క్ ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభం

ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మేయర్ నీతూకిరణ్

కంఠేశ్వర్, జూలై 19 : నగరంలోని న్యూ బ్యాంక్‌కాలనీ (20వ డివిజన్)లో పార్క్ ప్రహరీ, డ్రైనేజీ నిర్మాణ పనులను మేయర్ దండు నీతూకిరణ్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం శాస్త్రీనగర్‌లోని లాల్ బహదూర్‌శాస్త్రి పార్క్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నగరంలో ప్రజల సమస్యల పరిష్కారానికి కార్పొరేటర్లతో కలిసి కృషిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

గవర్నమెంట్ ప్లీడర్‌గా సీనియర్ న్యాయవాది వెంకటరమణా గౌడ్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా పెండెం రాజును నియమిస్తూ రాష్ట్ర న్యాయ మంత్రిత్వశాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు. వారు జిల్లా ప్రధానన్యాయమూర్తి సునీత కుంచాలను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి జిల్లా జడ్జితో పాటు రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు మంథని రాజేందర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్ శుభాకాంక్షలు తెలిపారు. - వినాయక్‌నగర్, జూలై 19

సంక్షిప్తంగా..

- **ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని వినతి** - ఖలీల్‌వాడి, జూలై 19: ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు బదిలీల్లోని సమస్యలను పరిష్కరించాలని డీఈవో దుర్గాప్రసాద్‌కు పీఆర్టీయూ తెలంగాణ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు కృపాల్ సింగ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఉద్యోగోన్నతులు, బదిలీల్లో భాగంగా జరిగిన పొరపాట్లు, సమస్యలను పరిష్కరించాలని కోరారు.
- **టీయూ లైబ్రరీ స్విచ్ బోర్డులో చెలరేగిన మంటలు** - డిచ్‌పల్లి, జూలై 19 : టీయూ గ్రంథాలయంలోని స్విచ్ బోర్డులో శనివారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. విద్యార్థులు చదువుకుంటున్న సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో భయాందోళనకు గురయ్యారు. సిబ్బంది వెంటనే అప్రమత్తమై మెయిన్ ఆఫ్ చేశారు. మంటలు తగ్గుముఖం పట్టడంతో విద్యార్థులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.
- **అయ్యప్ప ఆలయ నిర్మాణ పనుల పరిశీలన** - కోటగిరి, జూలై 19 : మండలకేంద్రంలో అయ్యప్ప, సాయిబాబా ఆలయ నిర్మాణ పనులను హైదరాబాద్‌కు చెందిన వేద పండితుడు శ్రీచంద్రమౌళి వెంకటేశ్వర శర్మ శుక్రవారం పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని, అక్టోబర్ 15 వరకు నిర్మాణం పూర్తి కావాలని సూచించారు. నిర్మాణ పనులు చాలా బాగున్నాయని ఆలయ స్థలదాత పోల విఠల్‌రావు గుప్తాను అభినందించారు.
- **బాడీ ఫ్రీజర్ వితరణ** - డిచ్‌పల్లి, జూలై 19 : మండలంలోని యానంపల్లి గ్రామానికి లయన్స్ సహారా నిజామాబాద్ ఆధ్వర్యంలో బాడీ ఫ్రీజర్‌ను శుక్రవారం అందజేశారు. జీపీ కార్యాలయంలో వీడీసీ సభ్యులకు లయన్స్ సహారా అధ్యక్షుడు నర్సింహారావు, ధనుంజయరెడ్డి అందజేశారు. సింగిల్‌విండో చైర్మన్ రాంచంద్రగౌడ్ కోరిక మేరకు దీనిని వితరణ చేసినట్లు వారు తెలిపారు.
- **మీసేవ కేంద్రాల కేటాయింపులో దివ్యాంగులకు ప్రాధాన్యమివ్వాలి** - డిచ్‌పల్లి, జూలై 19 : మీసేవ కేంద్రాల లబ్ధిదారుల ఎంపికలో దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ కోరారు. డీఆర్డీవో సాయాగౌడ్‌కు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు.
- **నాణ్యమైన చేపపిల్లలను అందించాలి** - జక్రాన్‌పల్లి/ ఇందల్వాయి/ బాల్కొండ, జూలై 19 : ప్రభుత్వం నాణ్యమైన, ఆరోగ్యమైన చేపపిల్లలను అందించాలని మత్స్య సహకార సంఘం సభ్యులు, మత్స్య కార్మికులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్లకు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. జక్రాన్‌పల్లిలో తహసీల్దార్ కిరణ్మయికి, ఇందల్వాయిలో తహసీల్దార్ వెంకట్‌రావుకు, బాల్కొండలో తహసీల్దార్ శ్రీధర్‌కు వినతిపత్రాన్ని అందజేసి, నాణ్యమైన చేపపిల్లలను అందజేయాలని కోరారు.
- **పీహెచ్‌సీ తనిఖీ** - డిచ్‌పల్లి, జూలై 19 : ఘన్‌పూర్‌లోని పీహెచ్‌సీని మండల ప్రత్యేకాధికారి యోహాన్.. ఎంపీడీవో రవీందర్‌తో కలిసి శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం జడ్పీహెచ్ఎస్, మండల పరిషత్ కార్యాలయంతోపాటు ప్రజాపాలన సేవాకేంద్రాన్ని పరిశీలించారు.
- **పాఠశాలకు నూతన భవనం నిర్మించాలి**- బోధన్ రూరల్, జూలై 19: బోధన్ మండలంలోని అమ్దాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు నూతన భవనం నిర్మించాలని కోరుతూ శుక్రవారం సోషల్ జస్టిస్ ఫర్ వర్డల్ హ్యూమాన్ రైట్స్ కౌన్సిల్ బోధన్ నియోజవకర్గ చైర్మన్ కర్రోల సాయిలు సుభాష్ అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.
- **అదనపు ప్రభుత్వ న్యాయవాదికి సన్మానం**- మోర్తాడ్, జూలై19: ఉప్లూర్ గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది చిన్నారెడ్డి ఇటీవల అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులయ్యారు. ఈసందర్భంగా ఉప్లూర్‌లో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సన్మానించారు.
- **పాఠశాల తనిఖీ**- వేల్పూర్, జూలై 19: అంక్సాపూర్ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్‌ను శుక్రవారం జిల్లా విద్యాధికారి దుర్గాప్రసాద్ తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులతో ఆయన మాట్లాడారు. డీఈవోను ఉపాధ్యాయులు సన్మానించారు.
- **కౌమార దశపై అవగాహన** -వేల్పూర్, జూలై 19: రామన్నపేట్ జడ్పీహెచ్ఎస్‌లో 8వ తరగతి నుంచి 10వ తరగతి బాల బాలికలకు కౌమార దశలో వచ్చే మార్పులపై వర్డ్ సంస్థ మానిటరింగ్ కోఆర్డినేటర్ రాజు, కమ్యూనిటీ కోఆర్డినేటర్ లావణ్య అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- **ఉపాధ్యాయులకు సన్మానం**- నవీపేట, జూలై 19: మండలంలోని లింగాపూర్ పాఠశాలలో కొన్నేండ్లుగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు నగేశ్, సతీశ్‌ను మాజీ సర్పంచ్ బత్తూర్ సాయిలు, గ్రామస్తులు శుక్రవారం సన్మానించారు. వారి స్థానంలో వచ్చిన ఉపాధ్యాయులు సబిత, రాజేశ్‌ను సన్మానించారు. జీపీ కార్యదర్శి సురేశ్, కారోబార్ గంధం రాజు, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.
- **25 బైక్‌లు సీజ్**- నవీపేట, జూలై 19: మండల కేంద్రంలో నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న 25 మోటర్ సైకిళ్లను సీజ్ చేసినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆర్టీఏ అధికారులు కిరణ్‌కుమార్, బూత్ సింగ్ స్పెషల్ పోలీసులు తనిఖీలు చేపట్టారు.
- **నాన్‌టీచింగ్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం**- మోర్తాడ్, జూలై19: కమ్మర్‌పల్లి కేజీబీవీలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసేందుకు నాన్‌టీచింగ్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో ఆంధ్రయ్య, పాఠశాల ఎస్‌వో గంగామణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్‌కుక్, స్వీపర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. వేతనం రూ.9750 ఉంటుందని, ఆసక్తి ఉన్నవారు ఈనెల 25లోగా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.
- **విద్యార్థులు మెమో, టీసీలు తీసుకెళ్లాలి**- మోర్తాడ్, జూలై 19: 2023-24 విద్యాసంవత్సరంలో ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా 10వ తరగతి, ఇంటర్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థుల మెమోలు, టీసీలు అధ్యయన కేంద్రం నుంచి తీసుకెళ్లాలని సెంటర్ కోఆర్డినేటర్ సాయన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమ్మర్‌పల్లిలోని ఓపెన్‌స్కూల్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
- **ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి**-ఆర్మూర్‌టౌన్, జూలై19: ఆర్మూర్ బాలికల జూనియర్ కళాశాలలో చోటుచేసుకున్న పరిణామాలపై ఇంటర్ విద్యాశాఖ అధికారులు దృష్టి సారించాలని పీడీఎస్‌యూ ఆర్మూర్ ఏరియా అధ్యక్షుడు అనిల్ కుమార్ అన్నారు. పట్టణంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో విద్యార్థులకు నచ్చిన కోర్సులను ఎంచుకొనే విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలియడంతో కళాశాలకు వెళ్లామని అన్నారు. నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తూ దురుసుగా ప్రవర్తించిన ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ నగర శివారులోని సారంగాపూర్‌లో గ్రామాభివృద్ధి కమిటీ, నగరంలోని స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం బోనాల పండుగ నిర్వహించారు. స్నేహ సొసైటీ ఆధ్వర్యంలో గౌతంనగర్ నుంచి మైసమ్మ